విశాలాంధ్ర కృష్ణా జిల్లా

టీచర్స్ సొసైటీ ఎన్నికలలో 98శాతం పోలింగ్

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ పంచాయతీ సమితి ఉపాధ్యాయ సహకార ప్రగతి సంఘానికి ఆదివారం నిర్వహించిన ఎన్నికలలో 98 శాతం ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారి కేఎస్ఆర్కె మూర్తి వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో కొనసాగిన ఈ ఎన్నికల్లో మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలలోని 126 మంది ఉపాధ్యాయ ఓటర్లకు 123 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మండల కేంద్రమైన మొవ్వ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పోలింగ్ అధికారిగా ఓ నాగబాబు, అసిస్టెంట్ పోలింగ్ అధికారిగా ఎం నెహ్రూ వ్యవహరించారు. ఈ సొసైటీ ఏడుగురుపాలకవర్గ సభ్యులకోసం మూడు ఉపాధ్యాయ సంఘాల నుంచి 20 మంది సభ్యులు పోటీ పడ్డారు.

మొవ్వ ఎండిఓ సుధా ప్రవీణ్ బదిలీ

విశాలాంధ్ర-కూచిపూడి: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా జరుగు తున్న బదిలీల ప్రక్రియలో మొవ్వ మండలంలో తొలిసా రిగా ఎండిఓని బదిలీ చేశారు. ఈ మేరకు వాట్సాప్‌లో జిల్లా అధికారులు సమాచారం విడుదల చేశారు. ఎండిఓజి సుధాప్రవీణ్‌ను పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ఈయన 2022 సెప్టెంబర్ లో అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు మండల నుంచి బదిలీపై పామర్రు నియోజకవర్గంలోనిమొవ్వ మండలానికి వచ్చేశారు. జిల్లా అధికారుల నుంచి అధికార యుతంగా ఉత్తర్వులు జారీ అయిన వెంటనే ఈ మండలం నుంచి రిలీవ్ అవుతారు.

కొండలమ్మ దేవస్థానంలో భక్తులు కిటకిట

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారిని సుమారు 25,000 మంది భక్తులు దర్శించుకొని, పాలపొంగళ్ళు సమర్పించి మొక్కుబడులను తీర్చుకొన్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాట్లు పరిశీలించారు.

కొండలమ్మను దర్శించుకున్న అధికారి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని కృష్ణాజిల్లా రెవిన్యూ అధికారి శ్రీమతి పి.రోజా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ శేషం వీర వెంకట కృష్ణమూర్తి గారు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ కానూరి సురేష్ బాబు గారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి యొక్క చిత్రపటము, శేష వస్త్రము మరియు లడ్డూ ప్రసాదము వారికి అందజేసారు.

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

విశాలాంధ్ర - చల్లపల్లి: భారత గణతంత్ర దినోత్స వం వేడుకల సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజ బాబు చేతుల మీదుగా జిల్లా ఎస్పీ జాషువా సమక్షంలో మోపిదేవి మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేయుచున్న పూసపాటి బ్రహ్మానందరావు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం చల్లపల్లిలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మానందరావును దుస్సాలువాలతో.. పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, జిల్లా నాయకులు కేసనకుర్తి శరత్ బాబు, అడ్డాడ ప్రసాద్ బాబు, స్థానిక నేతలు శామీరుపేట సాయిబాబు, అడ్డాడ వెంకటేశ్వరరావు, అద్దంకి సత్యనారాయణ, అయ్యంకి నాగ బ్రహ్మాచారి, శామీరుపేట సుబ్బయ్య, నాగరాజు, డోలా శ్రీనివాసరావు తదితర విశ్వ బ్రాహ్మణ సంఘం నేతలు పాల్గొన్నారు,

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - మోపిదేవి : రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరిగిన వ్యక్తికి శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మోపిదేవి మండల పరిధిలోని కొక్కిలిగడ్డ గ్రామంలోని ఎన్టీఆర్ నగర్ కు చెందిన రాయన వెంకటేశ్వరరావుకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న శ్యామ్ కిషోర్ ఆదివారం వెంకటేశ్వరరావుకు 7వేల రూపాయలను తన వంతు సాయంగా అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ, తన స్నేహితుడు రాయన వెంకటేశ్వరరావుకు తన వంతు సాయం అందించిన శ్యామ్ కిషోర్ కు ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నందిగం అభిషేక రావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తోట శ్యామ్ కృష్ణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేత మీసాల చిట్టిబాబు, నందిగం అశోక్ లతో పాటు బాధితుడు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో జయహో బిసి సమావేశం

విశాలాంధ్ర-పెదపారుపూడి: మండలంలోని వెంట్ర ప్రగడ గ్రామంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు ల ఆధ్వర్యంలో బీసీ జయహో సమావేశం ఆదివారం జరిగింది. తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా పాల్గొని ప్రసంగించారు. ఈ విషయం కుమార్ రాజా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జెండా బీసీలకు అండ అని అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు బీసీలకు ప్రత్యేకంగా పార్టీలో, ప్రభుత్వంలో అనేక పదవులు ఇచ్చిన ఘన చరిత్ర ఎన్టీఆర్ కే దక్కిందని అన్నారు. తదుపరి ఆస్థానములో పార్టీని తన భుజ స్కందాలపై వేసుకొని ఎంతో శాకశక్యంగా నడుపుతున్న ప్రస్తుత టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని బీసీలంతా ఆదరించి రాబోయే ఎన్నికలలో రాష్ట్రాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం, బాధ్యత బీసీలపై ఉందని కుమార్ రాజా వివరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సూరపనేని వెంకట సత్యనారాయణ, మరో నాయకుడు దానబోయిన వెంకటనారాయణ, లీగల్ విభాగం మండల శాఖ అధ్యక్షుడు గొరిపర్తి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీలను ఓడించండి: దోనేపూడి

విశాలాంధ్ర- నందిగామ: వచ్చే ఎన్నికల్లో లౌకిక ప్రజాస్వామ్య శక్తులను గెలిపించడానికి కృషి చేయాలని దానికి పార్టీ కార్యకర్తలను సన్నద్ధం చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. సీపీఐ నందిగామ పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో వార్డుల వారీగా పార్టీ నిర్మాణాన్ని చేపట్టాలని, నిధుల సేకరణలను పార్టీ సభ్యత్వ రెన్యువల్సును వేగవంతం చేయాలని, ప్రజా సమస్యలను తీసుకొని పనిచేయడం ద్వారా స్థానిక సమస్యలపై మడమ తిప్పని పోరాటం చేయాలని శంకర్ అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి చుండూరి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ నందిగామలో కమ్యూనిస్టు పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసుకోవడం ద్వార శాఖల నిర్మాణం చేసుకోవాలని కోరారు. ప్రముఖ న్యాయవాది మన్నెం నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థి యువజన ఉద్యమాలను బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నందిగామ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్ట చామంతి మండల కార్యదర్శి మన్నే హనుమంత రావు, సిపిఐ సీనియర్ నాయకులు రాంబాబు, వీరయ్య, ఎస్కే మౌలాలి, దార్ల నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. నందిగామ పట్టణ కమిటీకి నూతన కార్యదర్శిగా ఎస్కే మౌలాలి, సహాయ కార్యదర్శి దార్ల నాగేంద్ర కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కామ్రేడ్ వీరయ్యను నందిగామ నియోజకవర్గ ఏఐటియుసి కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం

విశాలాంధ్ర - మోపిదేవి: తెలుగుదేశం పార్టీ ద్వారానే బీసీలకు సముచిత స్థానం లభించిందని ఆపార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన మోపిదేవిలో జయహో బీసీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలందరు దుర్భరమైన అభద్రతా భావంతో జీవిస్తున్నారని, వారికి అండగా నిలిచేందుకు, వారిపై దాడులను అరికట్టేందుకు నారా చంద్రబాబు నాయుడు బీసీ రక్షణ చట్టం తీసుకుని వస్తున్నారని తెలిపారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఎన్టీఆర్ బిసిలకు సముచిత స్థానం కల్పించి వారిని చట్టసభలలోకి తీసుకెళ్లారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్టీఆర్ బీసీలకు 24% రిజర్వేషన్ కల్పించారని, దానిని చంద్రబాబు నాయుడు 34%కి పెంచితే మరలా దానిని జగన్మోహనరెడ్డి 24% తగ్గించారని తెలిపారు. రాజకీయా లలో బిసిలకు వివిధ స్థాయిలలో హోదా కల్పించడంతో పాటుగా మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకి మాత్రమే దక్కిందని అన్నారు. జగన్‌కి బిసిలపై ప్రేమ లేదన్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సభలలో, సమావేశాలలో చెప్పుకోవడం విడ్డురంగా ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు గురించి, రాష్ట్రంలో బీసీలు, దళితులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో జగన్మోహనరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు, దళితుల పక్షపాతి అని చెప్పుకునే జగన్ ప్రభుత్వం వారిపై దాడులు జరుగుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మోపిదేవి మండలంలో ఇటీవల దొంగతనం నెపం మోపి వైసీపీ నాయకులు గిరిజనులపై దాడులకు పాల్పడితే ప్రభుత్వం పేదలకు అండగా నిలబడిందా లేక వైసీపీ నాయకులైన పెత్తందార్లకు అండగా నిలబడిందా అని ప్రశ్నించారు. బాపట్ల జిల్లాలో అమర్నాథ్ గౌడ్ అనే బాలుడిని సజీవదహనం చేసిన నేరస్తులకు అండగా నిలబడింది ఎవరు అని ప్రశ్నించారు. అందుకోసమే చంద్రబాబు దళితులకు రక్షణ చట్టం ఉన్నట్లుగానే బీసీలకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం తీసుకుని వస్తున్నారని అన్నారు. ఆదరణ పథకం ద్వారా కులవృత్తుల వారికి పనిముట్లను అందించి ఆర్థికంగా తోడ్పాటునందించారని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు. నడకుదుటి జనార్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు, ఎంపీపీ రావి దుర్గా వాణి, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, మండల ఎస్సి సెల్ అధ్యక్షురాలు మాతంగి వెంకటేశ్వరమ్మ, మోపిదేవి మండల బీసీ సెల్ అధ్యక్షులు కందుల బసవయ్య, సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, బత్తిన దాసు, పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో 90 శాతం పూర్తయిన కులగణన

విశాలాంధ్ర-కూచిపూడి: ఈ నెలాఖర వరకు కొనసాగే కులగణన మొవ్వమండలంలో 90 శాతానికి పైగా పూర్తయింది. ఇదే సమాచారాన్ని సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది ద్వారా తెలిసింది. ఈనెల 19వ తారీఖున ప్రారంభమైన ఈ సర్వేలో మొవ్వ మండలంలో 16 సచివాలయాలలో 326 క్లస్టర్లలో 18,787 కుటుంబాలలో సర్వేకి శ్రీకారం చుట్టారు. పగలు సర్వర్ మొరాయించటంతో నత్త నడకన సాగిన సర్వేను సిబ్బంది ఉదయం, రాత్రివేళలో సైతం కొనసాగించారు. దీనితో రోజుకు 20 నుంచి 30 కుటుంబాలు సర్వే చేయాల్సిన సిబ్బంది కేవలం 10 నుంచి 15 కుటుంబాల వరకే సర్వే నిర్వహించారు. ఆదివారం వారాంతపు సెలవు దినమైనా సర్వర్ పని చేస్తుండటంతో పలువురు సర్వే నిర్వహించి లక్ష్యానికి చేరువవుతున్నారు. మండలంలో ఇంకా 2 వేలకు పైగా కుటుంబాల కులగుణన సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కుల గణన సర్వేలో క్లస్టర్లకు నియమించబడినసచివాలయ సిబ్బంది తో పాటువాలంటీర్లు, కొనసాగిస్తుండగా ఆయా పంచాయతీల కార్యదర్శులు ఎం.ఎస్.ఎస్ .మూర్తి, ఏ.డి.వి.ఎల్. ప్రసాద్, కళ్ళేపల్లి సోమేశ్వరరావు, ఇస్లావత్ భవాని, దేగల ఝాన్సీ లక్ష్మి, వక్కలగడ్డ నరసింహారావు, భార్గవి పరిశీలిస్తున్నారు

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన డివై దాస్

విశాలాంధ్ర-పెదపారుపూడి : పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డివై దాస్ ఎన్నికల ప్రచారాన్ని నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ఆదివారం ప్రారంభించారు. మండలంలోని బల్లిపర్రు, పెద్దమద్దాల, గొల్వేపల్లి, కొమరవోలు, రిమ్మనపూడి తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ 2009లో నియోజకవర్గం ఏర్పడిన తొలి ఎమ్మెల్యేగా గెలిచి అనేక సంక్షేమ పథకాలు అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చే అభివృద్ధి చేశానని అన్నారు. 2014లో సైతం కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిసవి చూసానని అన్నారు. 2024లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయనున్నట్లు ఆయన ప్రజలకు వివరించారు. మరొకసారి నియోజకవర్గానికి సేవ చేయటానికి తనను ఆదరించాలని ప్రజలను వేడుకున్నారు.

అగ్నికుల క్షత్రియులకు ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న అగ్నికుల క్షత్రియులను ఎం.ఎల్.ఎ అభ్యర్థిగా పార్టీలు ప్రకటించాలని అగ్నికులక్షత్రియ యూత్ ఫోర్స్ జాతీయ అధ్యక్షులు నాగిడి సాంబశివరావు అన్నారు. ఆదివారం అవనిగడ్డ మత్స్యకార సామాజిక భవనంలో విలేకరులతో మాట్లాడుతూ తమకు తరతరాలుగా నియోజకవర్గంలో ఎక్కువ శాతం అగ్నికులక్షత్రియులు ఉన్నప్పటికి ఏ పార్టీ కూడా మమ్మల్ని గుర్తించి రాజకీయ స్థానం కల్పించడం లేదని అన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ఆ సమస్యలు నెరవేర్చేందుకు రాజకీయ పార్టీలు అగ్నికులక్షత్రియులకు స్థానం కల్పించి టిక్కెట్ కేటాయించాలని లేని పక్షంలో అగ్నికులక్షత్రియ యూత్ ఫోర్స్ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపు, ఓటములను శాశిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నికులక్షత్రియ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా వెంకట నరసింహారావు, కార్యదర్శి పొనమాల నాగరాజు, అగ్నికులక్షత్రియ, యువత, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి

విశాలాంధ్ర అవనిగడ్డ : తన భర్త పక్షవాతం వచ్చి అనారోగ్యంతో ఉండటంతో తనను వేధిస్తున్నాడంటూ బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కోడూరు మండలం, ఉల్లిపాలెం గ్రామానికి చెందిన ఓ దళిత మహిళను పెద్దసింగ్ రాంబాబు అనే వ్యక్తి కొద్ది రోజులుగా కులం పేరుతో దూషిస్తూ కోరిక తీర్చమని వేధిస్తున్నాడని తాను నిరాకరించడంతో తనపై దాడి చేసి అసభ్యకరంగా బూతులు తిడుతున్నాడని శనివారం రాత్రి అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో వాపోయింది. శనివారం ఉదయం రాంబాబు కుటుంబ సభ్యులు ఇంటిపైకి వచ్చి అసభ్యంగా తిడుతూ కర్రలతో దాడి చేయడంతో కాలికి గాయం అయ్యిందని, తన భర్త పక్షవాతంతో లేవలేని స్థితిలో ఉన్న వ్యక్తిని కూడా కొట్టారని వాపోయింది. రాంబాబు అతని కుటుంబ సభ్యుల నుండి తమకు రక్షణ కల్పించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరింది. చికిత్స పొందుతున్న బాధితురాలును మాలమహనాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన పరామర్శించి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

రూ.50 లక్షలతో ముఖపండపం పునః నిర్మాణం: నాని

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: దేవాలయాలకు పూర్వవైభవం తేవడా నికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య (నాని) అన్నారు. ఆదివారంమచిలీపట్నం మెయిన్ రోడ్ లో వేంచేసియున్న శ్రీ రంగనాయక స్వామి దేవస్థానం నందు ముఖ మండపము మరియు క్లోజ్డ్ మండపము పునః నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 50 లక్షల రూపాయలతో అంచనా వేసిన ఈ కార్యక్రమంలో, దేవాదాయ ధర్మాదాయ శాఖ సర్వ శ్రేయోనిధి నుండి 42.5 లక్షలు, దేవస్థానం నిధుల నుండి 7.5 లక్షలు ముఖపండపము క్లోజుడు మండపము నిర్మాణాలకు వినియోగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపాటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, బూరగడ్డ రమేష్ నాయుడు, ఆలయ కార్య నిర్వహణ అధికారి కందుల వేణుగోపాలరావు, మరియు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా మహా చండీ హోమం: రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: ప్రజా శ్రేయస్సు కోసం గత నాలుగు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహా చండీ హోమం నిర్వహించామని మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ఆశయంతో బాలకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో కొల్లు రవీంద్ర నీలిమ దంపతులు చండీ హోమం నిర్వహించి, అది పూర్తయిన తర్వాత మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, తెలుగుదేశం నాయకులు వర్ల రామయ్య, రావి వెంకటేశ్వరరావు, మోటమర్రి బాబా ప్రసాద్, పిప్పళ్ళ లక్ష్మీ కాంతారావు, కుంచె నాని, తదితరులు పాల్గొన్నారు.

రేపే వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర అవనిగడ్డ : ఈ నెల 30 వ తేదిన మహాత్మాగాంధీ 70వ వర్ధంతి సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు గాంధీక్షేత్రంలో దివిసీమ లలిత కళా సమితి, గ్రామీణ యువజన వికాస సమితి ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు గాంధీక్షేత్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హత జూనియర్స్‌గా 6 వ తరగతి నుండి 10 వ తరగతి విద్యార్థులు, సీనియర్స్‌గా ఇంటర్ మరియు డిగ్రి విద్యార్థులు పాల్గొని వ్యాసములు తెలుగులోనే రాయాలన్నారు. పోటీలకు పాల్గొనే వారికి తెల్లకాగితములు, షాట్లు అందించబడతాయని, రంగు పెన్సిల్స్ వగైరా విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 994917719 ను సంప్రదించాలని అనంతరం జరిగే సభలో ముఖ్య అతిథిగా డా॥ మండలి బుద్ధప్రసాద్ పాల్గొని పోటీలోని విజేతలకు ప్రోత్సాహ బహుమతులు అందచేస్తారన్నారు.

అర్చకునికి నూతన వస్త్రాలు బహుకరణ

విశాలాంధ్ర-పెదపారుపూడి: మహేశ్వరపురం గ్రామంలో సీతారామాలయం అర్చకునికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేకు సంక్రాంతి కానుకగా నూతన వస్త్రాలు, మిఠాయిలు ఆ గ్రామ సర్పంచ్ జువ్వనపూడి రాజు, మాజీ సర్పంచ్ కలుగూరి వెంకటేశ్వర్లు చేతులమీదుగా అర్చకునికి ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - చల్లపల్లి : అక్షయ దెవల పర్స్ అధినేత, జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మాదివాడ వెంకటకృష్ణ (క్రిస్టియన్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం ఆవరణలో ఆదివారం వెంకటకృష్ణ ఆర్థిక సహకారంతో జనసేన పార్టీ నాయకుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని చల్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ప్రారంభించారు. ఈ శిబిరానికి చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, అవనిగడ్డ మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మెడ్ స్టార్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బి.విజయ చైతన్య నేతృత్వంలోని నిపుణులైన వైద్యులు శిబి రానికి హాజరైన వారిని పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు అందజేయడానికి సిద్ధం చేశారు. ఉచితంగా ఈసీజీ, 2డి ఎకో, కార్డియో గ్రాఫ్, గుండె స్కాన్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. యాంజియో గ్రామ్, స్టంట్ల అమరిక, బైపాస్ ఆపరేషన్లు చేయడానికి రిఫర్ చేశారు. నిపుణులైన వైద్యులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగేశ్వరరావు, కొండయ్య, సింధు, ప్రశాంతి, రవి లు శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. శిబిరానికి హాజరైన వారికి ఇబ్బందులు కలగకుం దా మాదివాడ వెంకటకృష్ణ ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణు గోపాలరావు, పార్టీ మండల అధ్యక్షులు చోడగం విమల కృష్ణ, కోన రాజశేఖర్, పూషడపు రత్న గోపాల్, గుడివాక శేషుబాబు, మర్రె గంగయ్య, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), తెలుగుదేశం పార్టీ మండల అధ్య క్షులు మోర్ల రాంబాబు, చల్లపల్లి టౌన్ పార్టీ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, తెలుగుదేశం పార్టీ మహిళా నేత దివి యుగంధరి, బచ్చు వెంకట్ నాథ్, జనసేన పార్టీ మత్స్యకార వికాసం నేత లంకే యుగంధర్, బాదర్ల లోలా క్షుడు నాయుడు, కామిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి రవికుమార్, కూరేటి రాఘవ, భూపతి

నిరుపయోగమవుతున్న దులహన్ పథకం

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: దుల్హన్ పథకానికి పదవ తరగతి ఉత్తీర్ణత అర్హతగా పెట్టడంవల్ల చాలామందికి ఈ పథకం వర్తించడం లేదని ఎటువంటి ఆంక్షలు లేకుండా దుల్హన్ పథకాన్ని అమలు చేయాలని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు డిమాండ్ చేశారు. ఆదివారం మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని మాచవరంలో నిరుపేద రిక్షా కార్మికుడు బుడా కుమార్తె వివాహం నిమిత్తం 20 వేల రూపాయల విలువైన బట్టలు తదితర సామాగ్రి అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు జనసైనికులు అవసరమైన వారిని ఆదుకునే విధంగా ముందుకు కదులుతున్నారని, ప్రభుత్వం అట్టహాసంగా ప్రవేశపెట్టిన దుల్హన్ పథకం నిరుపేదలకు అందడం లేదని సమాచారం అందడంతో రెండవ డివిజన్ ఇంచార్జ్ మణి బాబు, సిద్ధిక్, జన్ను నాగరాజు, కంచర్లపల్లి సీతయ్యల కృషితో, జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ సహకారంతో 20 వేల రూపాయల విలువైన వస్తువులు అందించడం జరిగింది అన్నారు.

ఉత్కంఠ భరితంగా ఓట్ల లెక్కింపు

విశాలాంధ్ర, కూచిపూడి: మొవ్వ పంచాయతీ సమితి ఉపాధ్యాయ సహకార పరపతి సంఘం ఓట్ల లెక్కింపు ఆదివారం మధ్యాహ్నం నుంచి చీకటి పడే వరకు ఉత్కంఠ భరితంగా సాగింది. ఏడుగురు డైరెక్టర్లకు నలుగురుఏపిటిఎఫ్ సభ్యులుకాగా,మిగిలిన ముగ్గురు యుటిఎఫ్ సభ్యులు విజేతలుగా నిలిచారు. ఎన్నికలలో విజేతలైన డైరెక్టర్ల వివరాలను ఎన్నికల అధికారి కె. ఎస్ ఆర్ మూర్తి ఆదివారం రాత్రి అధికారి కంగాప్రకటించారు. 20 మంది అభ్యర్థుల ఓట్ల లెక్కింపుమూడు గంటలకు పైగా సాగింది. రేకౌంటింగ్ నిర్వహించిన ముగ్గురు డైరెక్టర్లకు అవే ఓట్లు రావడంతో మొత్తం ఏడుగురు సభ్యులను ప్రకటించారు. ఆయన తెలిపిన విజేతల వివరాల ఇవే.. గరికపాటి వెంకటేశ్వరరావు(62), పాగోలు దుర్గాప్రసాద్(59), రాజులపాటి శ్రీనివాసరావు (57), మత్తి రత్నగిరి రావు (57), ఓలేటి రమేష్ (55),బత్తుల కిషోర్ బాబు (54), మొహమ్మద్ ఇంతియాజ్ (52) ఓట్లతో విజయం సాధించారు. వీరికి ఎన్నికల అధికారి అభినందనలు తెలిపారు.

అధ్యక్ష కార్యదర్శులుగా ఏపీటీఎఫ్ డైరెక్టర్లే

మొవ్వ పంచాయితీ సమితి ఉపాధ్యాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా మొహమ్మద్ ఇంతియాజ్, కార్యదర్శిగా గరికపాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా పాగోలు దుర్గాప్రసాద్, కోశాధికారిగా బత్తుల కిషోర్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నలుగురు ఎపిటిఎఫ్ డైరెక్టర్లు. విజేతలను ఆయా యూనియన్లనేతలు అభినందనలతో ముంచెత్తారు.

జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-మచి లీపట్నం: జగన్మోహన్ రెడ్డికి కౌంట్ డౌన్ మొద లైందని, ఇంకా 74 రోజులు మాత్రమేనని, వైఎస్సార్సీపీ దురాగాతా లకు ప్రజా కోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందని, ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు చెబుతుంటే, ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని పెడన మాజీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి అహంకారానికి, అరాచక పాలన కు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు అంతా సిద్ధమయ్యారు. 2024 ఎలక్షన్ తర్వాత వైఎస్ఆర్సిపి జెండా కనుమరుగు అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేసిన వైకాపా పార్టీ ప్రజలకు అవసరం లేదని తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టులు అన్ని పూర్తి చేస్తామని ఆయన అన్నారు. ఈ వైయస్సార్సీపి ప్రభుత్వం కొత్త పన్నులు వేసి ధరలు పెంచి ప్రజల రక్తాన్ని జలగల పీలుస్తుందని వేదవ్యాస్ పేర్కొన్నారు.

జగన్‌రెడ్డికి కౌండౌన్ ప్రారంభం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కౌండౌన్ ప్రారంభం అయ్యిందని, జగన్ రెడ్డి సిద్ధం అని బ్యానర్లు పెట్టుకుని ప్రజల్లోనికి వెళ్తున్నాడు కానీ రాష్ట్ర ప్రజలు జగన్ రెడ్డిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిటబాబు అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వైయస్ఆర్‌సిపి దురాఘతాలకు ప్రజా కోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందని గడిచిన 4 సంవత్సరాల 9 నెలల్లో ప్రజల్లోకి ఏ రోజు అడుగు పెట్టని జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలు వస్తున్నందున నేడు జగన్ రెడ్డి సిద్ధంతో బహిరంగ సభ నిర్వహించి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతనిధి కొల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అవినీతి సొమ్ముతో ఎక్కడికక్కడ ప్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, గడిచిన 5 సంవత్సరాల్లో ప్రతిపక్షాలు బ్యానర్ కట్టుకోవాలన్నా, హోర్డింగ్ పెట్టుకోవాలన్నా అధికార పార్టీ అడ్డుకుంటుందని, ఇటువంటి దౌర్జన్యాలు చేస్తూ ప్రతిపక్షాలను అణచివేస్తూ ఎన్నికలకు సిద్ధం అవుతున్నారన్నారు. ప్రజలకు 10 రూపాయలు ఇచ్చి ప్రజల నుండి 100 రూపాయలు దండుకున్న చరిత్ర వైసిపికే ఉందన్నారు. రాష్ట్రంలో మద్యం నిషేదిస్తానని హామీ ఇచ్చిన జగన్ 25 సంవత్సరాల పాటు మద్యంపై వచ్చే ఆదా యాన్ని తాకట్టు పెట్టి 36 వేల కోట్ల రూపాయలు అప్పు తీసుకున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ వైసీపీని బంగాళాఖాతంలో కలపాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.సెల్ నాయకులు, న్యాయవాది కర్రా సుధాకర్, భావిరెడ్డి వెంకటేశ్వరరావు, ఘంటశాల రాజమోహన్‌రావు, యలవర్తి చిన్న, రేపల్లె కృష్ణారావు, కొండవీటి పాండు రంగారావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 2nd ADDL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA

I.P.No.22 /2022

Between:
Kagitha Arjuna Rao - Petitioner
And
Arepalli Guruvulu and 6 others - Respondents

To
R.5: Syed Ismaiel, S/o. Irfan, Muslim, aged about 40 yrs, Business, Residing near Venu Gopala Swamy Temple Poranki Village, Penamaluru Mandal, Krishna Dist.,
R.6: Syed Saida, S/o.Basha, Muslim, aged about 25 yrs Business, Residing Sivalayam back side, Yanamalakuduru village, Penamaluru Mandal, Krishna District.

పై I.P.No.22/2022లో రెస్పాండెంట్ నెం.5 మరియు 6 అయిన మీ ఇరువురికి నోటీసు నిమిత్తం ది.14-02-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు ది.14-02-2024న ఉదయం గం.10-30లకు స్వయముగా గాని, లేక వారి వకీలు ద్వారాగాని పై తెల్పిన కోర్టు వారి యెదుట హాజరు కావలసినదిగా తెలియచేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది :14-02-2024

టి. చంటిబాబు, అడ్వకేట్ అండ్ నోటరీ
కాటూరు రోడ్డు,ఉయ్యూరు, కృష్ణాజిల్లా.
సెల్ : 9393534130
వుయ్యూరు, ది.28-01-2024

IN THE COURT OF THE 2nd ADDL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA

I.A.No.103/2022 in I.P.No.22 /2022

Between:
Kagitha Arjuna Rao - Petitioner/Petitioner
And
Arepalli Guruvulu and 6 others - Respondents/ Respondents

To
R.5: Syed Ismaiel, S/o. Irfan, Muslim, aged about 40 yrs, Business, Residing near Venu Gopala Swamy Temple, Poranki Village, Penamaluru Mandal, Krishna Dist.,
R.6: Syed Saida, S/o.Basha, Muslim, aged about 25 yrs Business, Residing Sivalayam back side, Yanamalakuduru Village, Penamaluru Mandal, Krishna District.

పై I.P.No.103/22 in I.P.No.22/2022లో రెస్పాండెంట్ నెం.5 మరియు 6 అయిన మీ ఇరువురికి నోటీసు నిమిత్తం ది.14-02-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు ది.14-02-2024న ఉదయం గం.10-30లకు స్వయముగా గాని, లేక వారి వకీలు ద్వారా గాని పై తెల్పిన కోర్టు వారి యెదుట హాజరు కావలసినదిగా తెలియచేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది :14-02-2024

టి. చంటిబాబు, అడ్వకేట్ అండ్ నోటరీ
కాటూరు రోడ్డు,ఉయ్యూరు, కృష్ణాజిల్లా.
సెల్ : 9393534130
వుయ్యూరు, ది.28-01-2024

కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ నిధులతో ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రహరీ గోడలను సంగీత నృత్య చిత్రాలతో తీర్చిదిద్దటం హర్షణీయమని ఘంటసాల సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ వి.కృష్ణవేణి తెలిపారు. కళాశాల ప్రహరీ గోడపై వివిధ రకమైన ప్రకటనలు, ఆ ప్రకటనలకు సంబంధించిన పోస్టర్స్, బ్యానర్స్‌తో నిండి ఉండటంపై వాటిని తొలగించేందుకు, నియంత్రించేందుకు కలెక్టర్ డిల్లీ రావుని కలుసుకుని విజ్ఞప్తి చేశామని ఆయన తక్షణమే స్పందించి మున్సిపల్ కమిషనర్‌కు ఆ విజ్ఞప్తిని పంపగా ఆయన స్పందించి తక్షణమే ఆదేశాలు జారీ చేయటంతో కళాశాల సంస్కృతి ప్రతిబింబించే చిత్రాలతో గోడలను రంగుల బొమ్మలతో తీర్చిదిద్దడంపై కృతజ్ఞతలు తెలుపుతూ హర్షాన్ని వ్యక్తం చేశారు.

పద్మ పురస్కార గ్రహీతలకు శుభాభినందనలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: తెలుగు సంస్కృతిని వారి వారి రంగాల ద్వారా ప్రతిబింబిస్తూ విశ్వవ్యాపితం చేసి అఖండ కీర్తినార్జించిన పద్మ అవార్డు గ్రహీతలకు కళా సంస్థల ప్రతినిధులు శుభాభినందనలు తెలిపారు. గాంధీనగరం మార్నింగ్ బెల్స్ కార్యాలయంలో భారతదేశ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కు పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవికి విభూషణ్ పద్మ విభూషణ్, హరికథా భాగవతారిణి కి పద్మశ్రీ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వీరికి పద్మ పురస్కారాలు లభిస్తున్నందుకు ప్రసూన రామన్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు, శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్, ప్రసూన రామన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం ప్రధాన ప్రతినిధులు బి.వి వీరభద్రరావు, డేవిడ్ రాజు తదితర సంస్థల పక్షాన ఎక్సరే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, గాయకుడు ఆదిరాల జయప్రభు, గాయకుడు ప్రిన్స్ తదితరులు తెలుగు జాతి గర్వించదగిన ఆ ప్రముఖులు ఆయా రంగాలలో వారందిస్తున్న సేవలను కొనియాడుతూ వారికి శుభాభినందనలు తెలిపారు.

డాక్టర్ నీలకంఠ రాశినేనికి చిరు సత్కారం

విశాలాంధ్ర - విజయవాడ(చిట్టినగర్): ప్రముఖ చర్మ వైద్య నిపుణులు డాక్టర్ నీలకంఠ రాశినేనికి చిరు సత్కారంతో సమ భావన మిత్రమండలి కమిటీ గౌరవించింది. ఆదివారం వాసవ్య మహిళా మండలి మందిరంలో 96వ సమావేశం విజయవాడ శాఖ సమభా వన మిత్ర మండలి అధ్యక్షులు కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రముఖ చర్మ వైద్య నిపుణులు డాక్టర్ నీలకంఠ రాశినేని పాల్గొని మాట్లాడుతూ శరీరంలో చర్మం ప్రధాన భాగమని, శిరస్సు మీది ఊడిపోయిన వెంట్రుకలకు బదులుగా మళ్లీ వెంట్రుకలను శాశ్వతంగా ఏర్పరిచే విధానాల గుర్చి, చర్మవ్యాధులు, పరిష్కార మార్గాల గురించి, కూలంకషంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యార్లగడ్డ రంగారావు, ఉపాధ్యక్షులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య పి ఆర్ కె ప్రసాద్, ప్రోగ్రాం అధ్యక్షులు డాక్టర్ ఎంవి రావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సినీ స్వర వసంత గానం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో స్వరఝరి సాంస్కృతిక సేవా సమితి (ఒంగోలు) సమర్పణలో ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి స్వర మారుతంతో వెల్లి విరిసింది. గాయనీ గాయకులుగా తాళ్లూరి శ్రీదేవి(సంస్థ అధ్యక్షురాలు), స్వర్ణలత, అంజు స్వామి, ఎస్ కె అంజి బాబు(సంస్థ ఉపాధ్యక్షులు), సాంబశివరావు, ఆలపాటి అశోక్ కుమార్, మిలటరీ కోటేశ్వరరావు, రంగనాథంలు జగదానందకారక, వెన్నెలైనా చీకటైనా, వేషము మార్చెను, నా మది నిన్ను పిలిచింది గానమై, రేపంటే రూపం కంటే, ప్రతి రాత్రి వసంత రాత్రి, నన్ను ఎవరో తాకిరి వంటి ఇత్యాది నాటి మేటి పాటలను భావ రసాత్మకంగా పాడి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. పర్యవేక్షణ తాళ్లూరు రవి చేయగా తెలుగు కళావాహిని అధ్యక్షులు చింతకాయల చిట్టిబాబు కళాకారులను అభినందిస్తూ ప్రసంగించారు.

అన్నదానం, వెండి తాపడంకు విరాళం

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగు అన్నదానంకు ప్రకాశం జిల్లా కారంపూడి గ్రామానికి చెందిన హరిదాసు సాంబశివరావు నిత్య అన్నదాన పథకమునకు రూ.10,116 గుంటూరు జిల్లా వెనిగండ్ల గ్రామానికి చెందిన జి.శివ దాసు కృష్ణ శ్రీ అంకమ్మ అమ్మవారి దేవాలయం వెండి తాపడమునకు రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు, కొలిపాక రాము పాల్గొన్నారు.

మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.222/2019

బిట్వీన్
సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ముదినేపల్లి బ్రాంచ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ రీజనల్ మేనేజర్, రీజియన్ ఆఫీస్ విజయవాడ - వాది
మరియు
చంద్రు వెంకట రాజ చౌదరి వగైరాలు - ప్రతివాదులు

టు డి2: ముత్యాల గంగాధరరావు, తండ్రి వెంకట రావు, హిందూ, వ్యాపారం, వయస్సు 36సం॥ములు, నివాసము ప్లాట్ నెం.ఎఫ్ఎఫ్3, భాగ్యనగర్, కానూరు, విజయవాడ జె.సి.జె.సి.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు నుండి దావా సమన్లు ఎన్నిసార్లు పంపించిననూ మీరు దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు మీకు పై నెంబరు దావాలో దావా సమన్లు పేపరు పబ్లికేషన్ ద్వారా అమలు జరుగుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసినారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం **ది.01-02-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని కోర్టుకు హాజరై తమ అక్షేపణలను తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా 01-02-2024

టి. శ్రీనివాసరావు, వాది తరుపు న్యాయవాది
కైకలూరు -521333
సెల్.నెం. 9848022862

తాగునీటి ఎద్దడి నివారణలో వైసీపీ వైఫల్యం

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర - విజయవాడ(చిట్టినగర్): నగరంలో తాగునీటి ఎద్దడి రోజు రోజుకి పెరిగిపోతుందని నివారించటంలో నగరపాలక సంస్థ అధికారపక్ష వైఎస్ఆర్సీపీ ఘోరంగా వైఫల్యం చెందిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. 56 డివిజన్ పాత రాజరాజేశ్వరి పేటలోని పాత మసీదు ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, సుబ్బరాజు కాలనీ, జండా చెట్టు ఏరియా ప్రాంతాలలో గత ఐదు రోజులుగా తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తెల్లవారుజామున 5:30 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి 10 గంటలకు, మూడు సమయాలలో అర గంట పాటు ఇచ్చే మంచినీటిని ఇప్పుడు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నార న్నారు. శీతాకాలంలోనే ఇంత నీటి ఎద్దడి వస్తే రానున్న ఎండ కాలంలో పరిస్థితి ఏ రకంగా ఉంటాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. కావున అధికారులు ప్రతినిధులు, స్పందించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సామాజిక సంక్షేమమే ధ్యేయం

డ్రైవింగ్ స్కూలులో సర్టిఫికెట్లు అందజేత

విశాలాంధ్ర - విజయవాడ(చిట్టినగర్): సామాజిక సంక్షేమమే ధ్యేయమని ది కృష్ణ డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజా అన్నారు. అసోసియేషన్ మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చి సెంటరులో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 1067వ బ్యాచి ట్రైనీలకు ఆదివారం కృష్ణాజిల్లా అంపాపురంలో జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించి రాజా మాట్లా డుతూ లారీ యాజమానుల సంక్షేమం కోసం 70 ఏళ్ళ క్రితం ఏర్పాటైన కృష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సామాజికసేవలో భాగంగానే ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు, వృద్ధులకు, రోగులకు ఏటా పెద్దమొత్తంలో ఆర్థికసాయం చేస్తోందని, రోడ్డుభద్రత లక్ష్యంగా నామ మాత్రపు రుసుముతో రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా అత్యున్నత సాంకేతికతతో సిమ్యులేటర్లపై 32 రోజులపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ముందుగా భారీ వాహనాలు నడిపేవారు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి(ఆర్టీఓ) వై.ఐశ్వర్యారెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఐశ్వర్యారెడ్డి మాట్లాడుతూ ఏ చిన్న రోడ్డు ప్రమాదం జరిగినా కుటుంబం వీధిన పడుతుందని గ్రహించి సుదూర ప్రాంతాలకు సరుకు రవాణాచేసే డ్రైవర్లు ప్రతిసారి అప్రమత్తంగా మెలగాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన ట్రైనీలకు ధ్రువపత్రాలను ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై వి ఈశ్వరరావు అందజేశారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ అధ్యక్షులు కోనేరు వెంకట రమేష్ మాట్లాడుతూ డ్రైవింగ్‌ను కెరీర్‌గా మలచుకునేవారికి మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షులు కేవీ రామారావు మాట్లాడుతూ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను విస్తరించామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ స్వాగతం పలికారు. ఉపాధ్యక్షులు కాజ వెంకటసత్య చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు, కార్యదర్శి రావి శరత్ బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, ప్రిన్సిపాల్ కె.ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రానున్న సాధారణ ఎన్నికల్లో పద్మశాలీలకు అన్ని రాజకీయ పక్షాలు తగిన ప్రాధాన్యత కల్పించాలని లేకుంటే తమ జనాభా అధికంగా ఉన్నచోట్ల ఇండిపెండెంట్‌లుగా పోటీ చేస్తామని అఖిల భారత పద్మశాలి సంఘం సమావేశంలో నాయకులు తీర్మానించారు. ఆదివారం వారి కళ్యాణ మండపంలో కోస్తాంధ్ర పద్మశాలీల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘం నాయకులు న్యాయవాది వైకే, అఖిల భారత పద్మశాలీయ సంఘం జాతీయ అధ్యక్షులు కద గంట్ల స్వామి ప్రధాన కార్యదర్శి గద్దం జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు శాసనసభ స్థానాలు రెండు పార్లమెంటు స్థానాలకు పద్మశాలి చేనేత సంఘీలకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలన్నారు ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి టిడిపి జనసేన పార్టీల అధ్యక్షుల వద్దకు ఒక ప్రతినిధి బృందం కలుసుకొని తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారు ప్రతి పద్మశాలి సంఘం చేనేత సంఘీలు సంఘటతమై పోటీలో నిలబడే వారికి ఓటు వేసి గెలిపించి వలసిన బాధ్యత వారిపై ఉందని అన్నారు చేనేత సంగీత సంఖ్య నియోజక వర్గంలో సంయుక్త సమావేశాలు నిర్వహించి రాజకీయ ప్రాంతాన్ని ప్రాతినిత్యం కోసం సమాజం కావాలన్నారు. ఈ సమావేశంలో ఖిలభారత సంఘం రాజకీయ విభాగం నాయకులు కొల్లి శివ సహాయ కార్యదర్శి గాలి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు,గంజి చిరంజీవి,గొడుగుల గంగ బాబు,కస్తూరి శెన వెంకటేశ్వర్లు,కోట సత్యం,తిప్పిన రాజ రామ్మోహన్ విజయవాడ నగర అధ్యక్షులు జి.భాస్కరరావు,జనరల్ సెక్రటరీ మల రవి,తదితరులు పాల్గొన్నారు

తెలంగాణలో వైఎస్ షర్మిల తమను మోసం చేసింది: బాలరాజు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలంగాణ ప్రజలను,వైఎస్ అభిమానులను నమ్మించి మోసం చేయటమే కాకుండా నిమ్మినడిచిన తమ లాంటి వారిని అర్థికంగా కూడా నష్టపోయామని తెలంగాణాకు చెందిన కొండగల్ ఇన్‌ఛార్జీ, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ తమ్మలి బాలరాజు ఆరోపించారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ హయాంలో పేద,బడుగు వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉండేవారని ఆయన మరణం అనంతరం శూన్యంగా మారి పేదప్రజలు అనేక రకాలుగా నష్టపోతూ అనేక ఇబ్బందులు పడుతున్నారని అటువంటి సమయంలో వైఎస్ షర్మిల తాను వైఎస్ కూతురిని అయన లేని లోటు తీర్చి ప్రజలకు అండగా ఉంటానని పార్టీ పెట్టడంతో తాము కుడా పార్టీలో చేరటం జరిగిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అనేక రకాలుగా సహాయసహకారాలు అందించటంతో పాటు అర్థికంగా కుడా తాము తోడ్పాటు అందించి పార్టీ ఎదుగుదలకు కృషి చేశామన్నారు. తెలంగాణ ఎన్నికల ముందు కుడా 3లక్షలు పార్టీకి ఫండ్ ఇచ్చాను అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేయడానికి వచ్చిందన్నారు. షర్మిల రాజకీయం కాదు వ్యాపారం చేస్తుందన్నారు. అమె ఎక్కడైనా అంబెద్కర్ కి ఒక్క దండ కూడా వేయలేదు. సొంత అన్నకే రాఖీ కట్టని మూర్ఖురాలు అని అగ్రహం వ్యక్తం చేశారు. షర్మిల పార్టీ పెట్టాక 60 మంది చనిపోయారు. ఒక్కరికి కూడా న్యాయం చేయలేదన్నారు. తమ నియోజకవర్గంలో 15లక్షలు ఖర్చు పెట్టి షర్మిలకి స్వాగతం పలికింది..ఏపిలో పర్యటిస్తున్న షర్మిల ఎక్కడైన రాజశేఖర్ రెడ్డి ఫోటో పెట్టిందా అని ప్రశ్నించారు. అవసరమైతే లోకేష్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫోటోలు పెట్టుకొంటుంది కాని వైఎస్ ఫోటో మాత్ర పెట్టడానికి మనస్సు రావటం లేదన్నారు. అనాడు కొడంగల్ లో రేవంత్ రెడ్డి ని ఓడిపోవాలని కోరింది. మరొక చోట కాంగ్రెస్ వాళ్ళకు మద్దతు ఇవ్వాలని సూచిందన్నారు. అనాడు షర్మిల తో వెళ్తామని సజ్జలని అడిగితే వెళ్ళమని చెప్పారు. అందుకే తాము వెళ్ళామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో షర్మిల ఎక్కడ నుంచి పోటీ చేస్తే అక్కడ తాము పోటీ చేస్తాం..మాకు పార్టీతో సంబంధం లేదు అఖరుకు వైసీపీ నుండి పోటీ చేసిన పోటీ చేస్తాం అన్నారు. వికరాబాద్ పార్టీ నాయకురాలు ఇ.సుధారాణి మాట్లాడుతూ పార్టీ కోసం అప్పులు చేసి నష్ట పోయాం అన్నారు. తెలంగాణ కోసం పనిచేస్తా అని చెప్పిందిఈ రోజు తాము ఏపికి వచ్చింది తమలాగ ఇక్కడ ప్రజలు నష్టపోకూడదని ఉద్దేశంతో వొచ్చాం అన్నారు.

అంబేద్కర్ మహాశిల్పం ఓ అద్భుత కళాఖండం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ: దేశ ప్రజలు గర్వించేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబే ద్కర్ విగ్రహాన్ని స్మృతి వనాన్ని అద్భుతమైన కళాఖండంగా ఆవిష్కరించారని.. ఇది ప్రపంచ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం 125 అడుగుల అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పాన్ని, స్మృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రూ. 2000 కోట్ల విలువ చేసే స్థలములో రూ. 400 కోట్లు ఖర్చు చేసి సామాజిక న్యాయ మహా శిల్పాన్ని, స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇక్కడకు రోజూ వేలాదిమంది వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసుకుని మరి ఈ ప్రాంతానికి, ఈ పవిత్ర స్థలానికి ప్రజలు కులాలు, మతాలు వంటి వాటితో సంబంధం లేకుండా వస్తున్నారని వివరించారు. తాము పుట్టిన ప్రదేశంలో ఇలాంటి మహోన్నత కళాఖండం ఏర్పాటు కావడం దేశ ప్రజలు గర్వించదగ్గ విషయమని విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. కులం, మతం వంటి వాటితో సంబంధం లేకుండా మనిషిని మనిషిగా చూసే సమాజ నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. బౌద్ధ సన్యాసులతో కలిసి ప్రబుద్ధ భారత్ నిర్మాణం క్యాలెండర్లను, పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలను అందించారు.

వ్యాధిగ్రస్తులకు మానవత ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-విజయవాడ: స్వచ్ఛంద సేవా సంస్థ మానవత వివిధ వ్యాధులతో బాధ పడుతున్న వారికి ఆదివారం ఆర్థిక చేయూతనందించారు. సంస్థ జిల్లా సర్వ సభ్య సమావేశం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయం నందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ ఐఐటీ పూర్వ ఆచార్యులు వి. వాసుదేవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కండరాల సమస్యతో నడవలేని స్థితిలో ఉన్న జీ రాధమ్మ కు, ఊపిరితిత్తులు, మూత్ర పిండాల వ్యాధి గ్రస్తులు అప్పలచారికి ఐదు వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని మానవ సేవే మాధవ సేవ అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. ఈ సమావేశానికి నాదెళ్ల సుమతీ దేవి అధ్యక్షత వహించగా కార్యదర్శి దావులూరి సాంబశివరావు ఉపాధ్యాయులు ఎమ్ వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మానవత కర్తవ్యాలను తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్త దానం, మరణాంతరం శరీరదానం చేయడానికి ముందుకు రావాలని అన్నారు. ప్రతినిధులు పి రాము, యశోద తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదిలో మునిగి ముగ్గురు విదార్థులు మృతి

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణానదిలో ఈత దిగి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన సంఘటన విజయవాడలో జరిగింది. వివరాల్లోకి వెళితే నడుపల్లి నాగ సాయి కార్తికేయ (13), కత్తి ప్రశాంత్ (13), గగన్ (17) వీరు ముగ్గురు నదిలో మునిగిపోయారు. గగన్ ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మిగిలిన ఇద్దరు పటమట హైస్కూల్ రోడ్డులోని నారాయణ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావటంతో పటమటకు చెందిన ముగ్గురుతో పాటు కానూరు సనత్ నగర్‌కు చెందిన షారూక్ ఈ నలుగురు నదిలో ఈత కోసం పిల్లలు వెళ్లారు. వీరిలో షారూక్ (14) ఒడ్డునే ఉన్నాడు. అతని కళ్ల ముంటే ముగ్గురు నీటి మునిగిపోయారు. చనిపోయిన ముగ్గురు మృతదేహాలను వెలికి తీశారు. కూమారులను కోల్పోయిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధిస్తున్నారు. బంధుమిత్రుల రోదనలోఆ ప్రాంతం శోకసంద్రమైయింది. కృష్ణానది తరచు ఇలాంటి ప్రమాదాలు జరగటంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల నదిలో గుంతలు ఏర్పడి సుడిగుండాలుగా మారి నీటిలోపలికి లాగేయటం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశంలోనే అమరావతి అతి పెద్ద ల్యాండ్ స్కాం

భ్రమరావతి పుస్తకావిష్కరణ సభలో మేధావులు, సామాజిక వేత్తలు

విశాలాంధ్ర,విజయవాడ(గాంధీనగర్): అధికారంలో ఉన్న ప్పుడు దోపిడీలకు పాల్పడిన చంద్రబాబు అధికారం కోల్పో యాక రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అటంకాలు కల్పిస్తు న్నారని పలువురు మేధావులు, సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అనీల్ గోపరాజు రచించిన భ్రమరావతి పుస్తకావిష్కరణ, అమరావతి మూడు రాజధానులపై సదస్సు అదివారం గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్టీస్‌లో ఎ.పి.ఎడిటర్స్ ఆధ్వర్యాన జరిగింది. అధ్యక్షత వహించిన ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణం రాజు మాట్లాడుతూ, అమరావతి దేశంలోనే అతి పెద్ద భూ కుంభ కోణమన్నారు. చంద్రబాబు ఆరాటమంతా వేలాది కోట్ల రూపాయల ప్రయోజనాలు ఇమిడి ఉన్న అమరావతి కోసమేనని కృష్ణంరాజు అన్నారు. అధికారం కోల్పోయిన చంద్రబాబు కక్ష కట్టినట్లుగా వ్యవహరించి అడుగడుగునా రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడ్డారని, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం పైనా వేయనన్ని కోర్టు కేసులు వేయించారని అన్నారు. ప్రస్తుతం సింగపూర్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్.ఈశ్వరన్‌తో కలిసి 1691 ఎకరాల అమరావతి భూమిని ఆ దేశ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేశారని కృష్ణంరాజు అన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ అమరావతిలో రైతులకు, సి.ఆర్.డి.ఎ.కు మధ్య జరిగింది ఒక వ్యాపార ఒప్పందమని అక్కడ భూ సమీకరణ ప్రక్రియ ఇంకా పూర్తి కానందువల్ల అమరావతికి రాజధానిగా గుర్తింపు ఉండదన్నారు. అమరావతి భూ కుంభకోణంలో చంద్రబాబుతో పాటు నారా లోకేష్‌కు కూడా భాగం ఉందన్నారు. గతంలో నారా బ్రాహ్మణి ఇన్వెస్ట్‌మెంట్ అసోసియేట్‌గా పని చేసిన సింగపూర్ కంపెనీకే చంద్రబాబు నాయుడు అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రాజెక్టును కట్టబెట్టారన్నారు. ఎ.పి.ఫైబర్‌నెట్ ఛైర్మన్ పి.గౌతం రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు స్వార్థం లేకుండా ఏ పనీ చేయరని, అమరావతిలో కూడా ఆయన స్వార్థప్రయోజనాలకు పెద్ద పీత వేయడంలో ప్రజల్లో తిరుగుబాటు వచ్చిందని ఫలితంగా మంగళగిరిలో కూడా నారా లోకేష్ పరాజయం పాలయ్యారన్నారు. ఎ.పి. ఎన్.ఆర్.టి. సొసైటీ అధ్యక్షులు వెంకట్ ఎస్. మేడపాటి సదస్సుకు తన సందేశాన్ని పంపిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు నిజమైన, అందరికీ అమోద యోగ్యమైన రాజధానిని ఏర్పాటు చేసే సత్తా ఒక్క జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే ఉందన్నారు. జనవాహిని సామాజిక సంస్థ అధ్యక్షుడు డి.ఎస్.ఎన్.వి. ప్రసాద బాబు మాట్లాడుతూ అమరావతిలో సమీకరించిన మొత్తం భూములను ప్రభుత్వ పరం చేయాలని యాజమాన్య హక్కులు ప్రభుత్వానికి మాత్రమే ఉండాలని సూచించారు. వోల్డ్ ఢిల్లీతో సంబంధం లేకుండా దేశ రాజధానిగా నిర్మించిన న్యూఢిల్లీలో భూములన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని, పంజాబ్, హర్యానా రాజధాని చండీగఢ్‌లో కూడా భూములు ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు చింతా రాజశేఖర్ మాట్లాడుతూ అమరావతి ద్వారా లక్షలాది కోట్ల రూపాయల దోపిడీకి చంద్రబాబు , ఆయన అనుచరులు ప్రయత్నించారని అయితే 2019 ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీని ఓడించడంతో వారి లక్ష్యం నెరవేరలేదన్నారు. నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ కో కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిపాలన కోసం రాజధాని ఏర్పాటు చేయాలని అయితే రాజధాని నగరం నిర్మిస్తామంటూ చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి.లో కేవలం అధ్యక్ష భవనం, పార్లమెంట్, వివిధ శాఖల కార్యాలయాలు మాత్రమే ఉంటాయని ఆయన తెలియజేశారు. సామాజిక కార్యకర్త రజనీ చౌదరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారం వల్ల ప్రజలు ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జయప్రకాష్, ఆంధ్రా అడ్వకేట్స్ ఫోరం కన్వీనర్ బి. అశోక్ కుమార్, నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తుళ్ళూరు సూరిబాబు ,అఖిల భారత బ్రాహ్మణ మహాసభ జోనల్ కార్యదర్శి కృత్తివెంటి చంద్రశేఖర్ సీనియర్ పాత్రికేయుడు మన్నే సాంబశివరావు, సి.హెచ్. సత్యనారాయణ రాజు, గీతా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు రాష్ట్రాభివృద్ధి- సంక్షేమంపై క్విజ్ వ్యాసరచన పోటీలు నిర్వహించి వారికి నగదు బహుమతులు, జ్ఞాపికలు,

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - విజయవాడ (చిట్టినగర్): అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘానికి కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ కోరారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ హాలు నందు సంఘం కార్యనిర్వాహక వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్ ముందుగా ప్రధాన కార్యదర్శి నివేదికలో కరెంటు గానుగల ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన లోన్లు మంజూరు చేయాలని, ఉచిత విద్యుత్ అందజేయాలని, తెలి నేస్తంకు ఆర్థిక సహాయం అందించాలని, విదేశీ విద్యకు ప్రాధాన్యత నివ్వాలని, నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం సభ్యుల ఆమోదం పొందారు. సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ అనంతం, కోశాధికారి నాగరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం, గోసంరక్షణకు విరాళం

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగు అన్నదానంకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు నగరం యూసఫ్ గూడాకు చెందిన కీర్తిశేషులు సజ్జ రజనీ కుమార్ జ్ఞాపకార్థం వారి పిల్లలు సునీత మరియు సుధీర్ శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు 50 వేల ఒక్క రూపాయి గోసంరక్షణకు 50 వేల రూపాయలు ఆలయ కార్యనిర్వహణ అధికారి మరియు డిప్యూటీ కలెక్టర్ శ్రీకే రమేష్ నాయుడు సూచనల మేరకు బ్యాంకు చెక్కుల ద్వారా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా విరాళంగా అందజేశారు. వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ అర్చకులు వేద పండితుల చే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేసినారు.

ఆటల పోటీల్లో 8 బహుమతులు

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో ఆడిన ఆటలల్లో శనివారం వరకు జరిగిన ఆడుదాం ఆంధ్ర నియోజికవర్గ క్రీడా పోటీలలో పెనుగంచిప్రోలు మండలానికి మొత్తం 8 ఆటలలో బహుమతులు గెలుచుకున్నారని మండల పరిషత్ అధికారి. సాయి హర్ష తెలిపారు. జిల్లా పోటిలకు వెల్లే ముండ్లపాడు ఖో-ఖో క్రీడాకారులందరికి పెనుగంచిప్రోలు మండల పరిషత్ అధ్యక్షులు శ్రీ మర్కపూడి గాంధీ. ఎం పి డి ఓ సాయి హర్ష అభినందనలు తెలిపారు.

జర్నలిస్ట్‌ను పరామర్శించిన గన్నే అన్న

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయ పడి నిమ్రా హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ హఫీజ్ ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నే వెంకటనారాయణ ప్రసాద్ పరామర్శించారు. విధి నిర్వహణలో భాగంగా కొద్దిరోజుల క్రితం ఇబ్రహీంపట్నంలోని ఎమ్మార్వో కార్యాలయానికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన పిల్లల్ని తప్పించబోయి డివైడర్ను ఢీకొనడంతో గాయాల పాలైన హఫీజ్ ను పరామర్శించిన గన్నే అన్న ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో యలమంచిలి శ్రీనివాస్ పొన్నం రవి చావా నరసింహారావు ఉన్నారు.

సీపీఐ నాయకులు జాస్తి సక్కుబాయి మృతి

శ్రద్ధాంజలి ఘటించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ : సీపీఐ సీనియర్ నాయకులు జాస్తి సక్కుబాయి(85) ఆదివారం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. భర్త జేవీ చౌదరి గతంలోనే మరణించారు. సమాచారం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినని వనజ, కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతాయ్య, జిల్లా సీనియర్ నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్ పిచ్చయ్య, సీపీఐ పెనమలూరు గ్రామ కార్యదర్శి బాలస్వామి, పార్టీ పోరంకి గ్రామ నాయకులు తాతినేని రమేష్ పోరంకి వసంత నగర్‌లోని సక్కుబాయి నివాసానికి వెళ్లి ఆమె భౌతికాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అక్కినని వనజ మాట్లాడుతూ సక్కుబాయిఆమె భర్త కమ్యూనిస్టు పార్టీక ఇఎనలేని సేవలు అందించారని చెప్పారు. చౌదరి చలసాని వెంకటరత్నం సహచరులుగా ఉండి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారన్నారు. విజయవాడ నగరంలో కార్పోరేటర్‌గా సేవలు అందించారని గుర్తు చేశారు. ది కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో కీలక పాత్ర పోషించారని, పార్టీ శాఖా కార్యదర్శిగా ఉన్నారని తెలిపారు. భర్తతో పాటు సక్కుబాయి కూడా పార్టీ నిర్మాణంలో, మహిళా సంఘంలో చలసాని రత్నకుమారితో పాటు అనేక కార్యక్రమాల్లో పాల్గొని చురుకైన పాత నిర్వహించారని కొనియాడారు. ఆనాడు కృష్ణలంక ప్రాంతం నివాసం ఉన్న వీరు పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. సక్కుబాయి మృతదేహాన్ని విజయవాడ కృష్ణలంకలోని చలసాని భవన్ వద్దకు తీసుకువచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి సక్కుబాయి మృతదేహంపై పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, స్థానిక నాయకులు మందలపు శ్రీనివాస్, మూలి శివన్నారాయణ తదితరులు నివాళులర్పించారు. అనంతరం సక్కుబాయి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

జగ్గయ్యపేట పురపాలక సంఘం-ఎన్టీఆర్ జిల్లా
ఇ-ప్రొక్యూరుమెంట్ టెండర్ నోటీసు

Roc.No.1648 /E1/GF Dt:27.01.2024

జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో జనరల్ ఫండ్ నిధుల నుండి **రూ.56.45** లక్షల నిధులతో **9 పనులకు** సి.సి.రోడ్లు, సి.సి.డ్రైన్, కాంపౌండ్ వాల్, 40 హెచ్.పి. మోటార్ సెట్ రిపేర్, బోర్, గ్రావెల్ ఫిల్లింగ్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు ఇ-ప్రొక్యూరుమెంటు టెండర్లను కోరబడుచున్నవి. కావున సదరు ఇ-ప్రొక్యూరుమెంటు టెండర్లను **ది.29-01-2024**వ తేది నుండి **ది: 01-02-2024** తేదీ వరకు https://tender.apeprocurement.gov.in/ ద్వారా దాఖలు చేసుకోనవలసినదిగా తెలియజేయడమైనది.

Commissioner,
Jaggayyapet Municipality.